


APTEL/2015/65279

# V న్యూస్

మన ఊరు - మన వార్తలు
తెలుగు దినపత్రిక

e-mail : vnewsmachilipatnam@gmail.com
e-mail : vnewsindia@gmail.com

Postal Reg.No. MPM/L22/VNEWS/22-24




సంపుటి :9 సంచిక : 236 మచిలీపట్నం, విజయవాడ, కాకినాడ, గుంటూరు, ఖమ్మం, వైఎస్ఆర్ కడప, ఒంగోలు, పొట్టి శ్రీరాములు నెల్లూరు 31-01-2023 మంగళవారం పేజీలు :4 వెల : రూ.3/-










# జీఎస్‌డీపీ గ్రోత్ రేట్‌లో ఏపీనే అగ్రగామి: సీఎం జగన్

**పల్నాడు:** నవరత్నాలు, ఇతర సంక్షేమ పథకాలతో రాష్ట్రంలోని ప్రతీ నిరుపేద కుటుంబానికి ఎంతో మేలు జరుగుతోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. జగనన్న చేదోడు పథకంకింద లబ్దిదారులకు మూడవ విడత సాయాన్ని సోమవారం జిల్లాలోని వినుకొండలో జరిగిన కార్యక్రమంలో విడుదల చేశారు. అంతకు ముందు ఆయన మాట్లాడుతూ.. "వెనకబడిన కులాలను, వర్గాలను.. వెన్నెముక కులాలుగా మారుస్తామని మాట ఇచ్చాం. ఈ మూడు ఏళ్లలో నవరత్నాలులోని ప్రతీ పథకాన్ని, సంక్షేమ పథకాల్లోని ప్రతీ పథకాన్ని ఈ రాష్ట్రంలోని ప్రతీ వర్గాల కుటుంబాలకు మేలు చేసేలా మన అందరి ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తూ వచ్చింది. ఇచ్చిన మాట అమలు చేసే విషయంలో భాగంగా.. సొంత షాప్ ఉన్న రజక సోదరుడికి, నాయీబ్రాహ్మణుడికి, దర్జీ అక్కాచెల్లెలకు ఏటా పది వేల రూపాయల ఆర్థిక సాయం చేసేలా జగనన్న చేదోడు పథకం తీసుకొచ్చాం. లంచాలకు తావులేని వ్యవస్థ ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నాం. వివక్ష లేకుండా పారదర్శకంగా అందజేస్తున్నాం. వరుసగా ఈ మూడేళ్లలో అక్షరాల మూడు లక్షల ముప్పై వేల మందికి మంచి చేస్తూ.. నేడు రూ. 330 కోట్లు నేరుగా ఖాతాల్లోకి జమ చేస్తామని సీఎం జగన్ ప్రకటించారు. మొత్తంగా.. జగనన్న చేదోడు కార్యక్రమంతో రూ. 927 కోట్లు జమ చేసినట్లు అవుతుందని తెలిపారు.



రాష్ట్రంలోని ప్రతి నిరుపేద కుటుంబానికి మేలు జరుగుతోంది. మొత్తం 43 నెలల కాలంలోనే నేరుగా 1.92 లక్షల కోట్లు అందించామని, టీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.3 లక్షల కోట్లు అందించామని సీఎం జగన్ వినుకొండ వేదిక నుంచి ప్రకటించారు.

ఇవాళ మన రాష్ట్రం దేశంలోనే జీడీపీ జీఎస్‌డీపీ(గ్రాస్ స్టేట్ డెమోస్టిక్ ప్రొడక్ట్) ప్రకారం.. మన గ్రోత్ రేట్ 11.43 శాతంతో దేశంలోనే మొదటి స్థానంలో ఉందని గర్వం చెప్తున్నానని సీఎం జగన్ పేర్కొన్నారు. దేశానికే ఆదర్శంగా పరిగెడుతోందని తెలిపారు. ఇలాంటి పరిస్థితిని పట్టించుకోకుండా.. గిట్టనివాళ్లు రాష్ట్రం శ్రీలంక అయిపోతోందంటూ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు. ఇదంతా గమనించాలని ఏపీ ప్రజలకు ఆయన పిలుపు ఇచ్చారు. ప్రతీ రంగంలో ముందుకు దూసుకెళ్తున్నప్పుడే ఇలాంటి ఘనత సాధ్యమవుతుందన్నారు. రైతులు, అక్కాచెల్లెమ్మలు.. ఇలా అందరికీ సంక్షేమ పథకాల ద్వారా సాయం, చేయూత ఇస్తున్నామని.. తద్వారా వాళ్లు వాళ్ల కాళ్ల మీద నిలబడుతూ రాష్ట్రాన్ని ముందుకు పరిగెట్టిస్తున్నారని సీఎం జగన్ స్పష్టం చేశారు.

# కలుషిత ఆహారం తిని 150మంది విద్యార్థినులకు అస్వస్థత



**సత్తెన్నపల్లి :** పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురం డా.బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల విద్యాలయంలో సుమారు 150మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఉదయం కలుషిత అల్పాహారం తీసుకోవడం వల్ల సుమారు 30మంది వాంతులు, విరేచనాలతో ఇబ్బందిపడ్డారు. తర్వాత మధ్యాహ్న భోజనం అనంతరం మరికొందరు వాంతులతో అస్వస్థతకు గురవడంతో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అప్రమత్తమయ్యారు. స్వల్ప జ్వరం, నీరసంతో మరికొందరు బాధపడటంతో మొత్తం 150 మందిని సత్తెనపల్లి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారందరికీ ఆసుపత్రిలో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆర్డీవో రాజకుమారి, డీఎస్పీ ఆదినారాయణ ఆసుపత్రిలోని బాలికలను పరామర్శించారు. విద్యార్థినుల ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. విద్యాలయంలో మొత్తం 640మంది విద్యార్థినులు చదువుతున్నారు.

# వాడీవేడిగా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం



**కడప:** ఉమ్మడి కడప జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. మంత్రులు, జిల్లా కలెక్టర్‌ను వైకాపా జడ్పీటీసీలు ప్రశ్నలతో ఉక్కిరి బిక్కిరి చేశారు. పలు సమస్యలను లేవనెత్తుతూ.. వివిధ శాఖల ఇబ్బందులను ప్రస్తావించారు. జిల్లాలో ప్రభుత్వ భవనాలు, సచివాలయ భవనాలు, ఆర్బీకేలు, రోడ్లు తదిరత నిర్మాణాలు పూర్తి చేసినా బిల్లులు ఇవ్వడం లేదని జడ్పీటీసీ సభ్యులు రఘునాథరెడ్డి, శివప్రసా ద్‌రెడ్డి ఘాటుగా విమర్శించారు. బిల్లులు చెల్లించకపోతే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని అన్నారు. వేదికపై ఉన్న మంత్రులు తమ సమస్యలు పట్టించుకోవాలని కోరారు. ప్రజాప్రతినిధులకు గౌరవం కరువైందని పంచాయతీరాజ్ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి విమర్శించారు. దీనిపై స్పందించిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ప్రజాప్రతినిధులను గౌరవించాలన్నారు. సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

# 'ప్రజల బాధలను దగ్గరగా చూశా'.. గడ్డకట్టే మంచులోనూ రాహుల్ ప్రసంగం

**దిల్లీ :** గడ్డకట్టే చలిలో భారత్ జోడో యాత్ర ముగింపు సభ జరిగింది. ఒకవైపు మంచు కురుస్తున్నా లెక్క చేయకుండా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రసంగాన్ని కొనసాగించారు. ముగింపు సభలో భాగంగా జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో లాల్‌చౌక్‌లో జెండా ఎగురవేశారు.

ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ఈ పాదయాత్రకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. 'ప్రజల సహకారం చూసి నాకు కళ్లవెంట నీరు వచ్చింది. ఒక దశలో యాత్ర పూర్తి చేయగలనా అనుకున్నా. చలిని లెక్కచేయకుండా ప్రజలు సభకు హాజరయ్యారు. వారి సహకారం లేకుండా ఏ పనీ సాకారం కాదు. పాదయాత్రలో అన్ని వర్గాల ప్రజలు, మహిళలు తమ బాధలు నాతో పంచుకున్నారు. ఈ పాదయాత్ర నాకు ఎన్నో పాఠాలు నేర్పింది. ప్రజల దీనస్థితి చూసే టీషర్టుతోనే యాత్ర చేయాలని నిర్ణయించుకున్నాను. యాత్రలో భాగంగా ఓ రోజు నలుగురు చిన్నారుల నా వద్దకు వచ్చారు. వారు యాచకులు. వారి ఒంటిపై దుస్తులు కూడా లేవు. వారు చలిలో వణికిపోతున్నారు. నాకు తెలిసి వారికి



తగిన ఆహారం కూడా ఉండదు. వారు జాకెట్స్, స్వెట్టర్లు వేసుకోలేదు. అప్పుడే అనుకున్నా నేను కూడా వేసుకోకూడదని' అని వెల్లడించారు.

కశ్మీర్‌లో తన పాదయాత్ర గురించి మాట్లాడుతూ.. 'భయం లేకుండా జీవించడాన్ని నా కుటుంబం నుంచి నేర్చుకున్నాను. భయపడుతూ బతికితే అది జీవితమే కాదు. కశ్మీర్‌కు కాలినడకన కాకుండా వాహనంలో వెళ్లమని నాకు భద్రతాసిబ్బంది చెప్పారు. కాలినడకన వెళ్తే.. మీపై గ్రనేడ్లు విసిరే అవకాశం ఉందని చెప్పారు. కానీ నేను మాత్రం నా తెల్లటి టీ షర్ట్‌ను ఎరుపు రంగులో మార్చాలనుకునే వారికి అవకాశం ఇవ్వాలనుకున్నాను. ఇక్కడ నేను ఊహించినట్లే జరిగింది. ఇక్కడి ప్రజలు నాకు గ్రనేడ్లు ఇవ్వలేదు. ప్రేమను మాత్రమే పంచారు' అని అన్నారు. అలాగే కశ్మీర్‌కు మళ్లీ రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

దేశవ్యాప్తంగా 145 రోజుల పాటు జోడో యాత్ర సాగింది. తమిళనాడు నుంచి కశ్మీర్ వరకు ఈ యాత్రను కొనసాగించారు. ఈ ముగింపు సభలో ప్రియాంకా గాంధీ, మల్లికార్జున ఖర్గేతోపాటు కశ్మీరీ అగ్రనేతలు ఫరూక్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ పాల్గొన్నారు.

# వడ్డెర సామాజిక వర్గానికి రాజకీయంగా అవకాశాలిస్తాం: నారా లోకేశ్



**వి.కోట (చిత్తూరు):** వడ్డెర సామాజిక వర్గానికి రాజకీయంగా అవకాశాలు కల్పించి పైకి తీసుకొస్తామని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. తెదేపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ వర్గానికి ఉపాధి అవకాశాలు పెంచుతామని చెప్పారు. నాలుగోరోజు 'యువగళం' పాదయాత్రలో భాగంగా ఆయన వడ్డెర సామాజిక వర్గానికి చెందిన వారితో సమావేశమై.. వారి సమస్యలను ఆలకించారు. తెలుగుదేశం అధికారంలో ఉండగా ఆ సామాజిక వర్గం కోసం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ఆయన వివరించారు. అధికారంలోకి రాగానే అండగా నిలుస్తామని వారికి భరోసా ఇచ్చారు.

నాలుగోరోజు కుప్పం నియోజకవర్గంలోని చెల్దిగానిపల్లె నుంచి ప్రారంభమై పాదయాత్ర పలమనేరు నియోజకవర్గంలోకి ప్రవేశించింది. దారి పొడవునా ప్రజలతో లోకేశ్ మమేకమై వారి సమస్యలను తెలుసుకున్నారు. పలుచోట్ల లోకేశ్‌తో సెల్ఫీలు తీసుకునేందుకు విద్యార్థులు, యువత పోటీపడ్డారు. వి.కోట మండలంలోని చెక్‌పోస్టు కూడలిలో భారీ గజమాలతో తెదేపా శ్రేణులు యువనేతకు స్వాగతం పలికారు. చెల్దిగానిపల్లె నుంచి పలమనేరు నియోజకవర్గంలోకి వెళ్లే మార్గంలో కొంత ప్రాంతం కర్ణాటక పరిధిలోకి రావడంతో అక్కడి పోలీసులు పాదయాత్రకు భద్రత కల్పించారు. సోమవారం రాత్రి కృష్ణాపురం టోల్‌గేట్ సమీపంలో లోకేశ్ బస చేయనున్నారు.

# సీఎం జగన్ ప్రయాణిస్తున్న విమానం అత్యవసర ల్యాండింగ్



**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దిల్లీ వెళ్లే విమానం సాంకేతిక లోపంతో అత్యవసరంగా ల్యాండ్ అయ్యింది. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే గన్నవరం విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండింగ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. సాయంత్రం 5.03 గంటలకు బయలు దేరిన విమానం.. 5.26 గంటలకు అత్యవసరంగా ల్యాండ్ అయినట్లు సమాచారం. విమానం ఏసీ వాల్వ్‌లో లీకేజీ వల్ల సమస్య ఏర్పడినట్లు సీఎంవో అధికారులు తెలిపారు. సమస్యను గుర్తించిన పైలట్ విమానాన్ని వెనక్కి మళ్లించారని చెప్పారు.

మరోవైపు ఇవాళ రాత్రికే సీఎం దిల్లీ వెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలని సీఎంవో అదేశించింది. అవసరమైతే మరో విమానంలో దిల్లీ వెళ్లేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం వెంట సీఎస్ జవహార్ రెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, అధికారులు పూనం మాలకొండయ్య, కృష్ణ మోహన్‌రెడ్డి, చిదానందరెడ్డి వెళ్లనున్నారు. రేపు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ దిల్లీలోని లీలా ప్యాలెస్ హోటల్‌లో దౌత్యవేత్తలతో జరగనున్న ఏపీ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లో జగన్ పాల్గొనాల్సి ఉంది.

# సంఘర్షణ పర్వం

'మానవ జీవితమే ఒక మహాభారతం/ అది మంచి చెడుల రెంటి నడుమ నిత్య ఘర్షణం/ నరులుండే ఇల సకలం కురుక్షేత్రమే/ ఇక జరుగుతుంది అనుక్షణం ధర్మయుద్ధమే'- 'కురుక్షేత్రం' చిత్రం కోసం శ్రీశ్రీ రాసిన పాట ఇది. మానవ జీవితాన్నే మహాభారతంగా, మంచి చెడుల నడుమ నిత్యం జరిగే ఘర్షణగా ఆయన అభివర్ణించాడు. కాలాలు మారినా, తరాలు మారినా మంచి చెడుల మధ్య జరిగే ఘర్షణ సమసిపోయే పరిస్థితులు లేవు. భవిష్యత్తులోనూ అలాంటి పరిస్థితులు ఉండవేమో! 'ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం/ నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం' అని కూడా అన్నాడు శ్రీశ్రీ. ప్రపంచంలో దుర్బలులను పీడించే బలవంతుల జాతి ఉన్నంత వరకు ఘర్షణలు తప్పవు. ఘర్షణలు ముదిరినప్పుడు యుద్ధాలూ తప్పవు. అందుకే తన 'నా దేశం నా ప్రజలు' అనే 'ఆధునిక మహాభారతం'లో శేషేంద్ర ఇలా అంటారు: 'పోట్లాట నేను బతకడానికి పీల్చే ఊపిరి/ నా అవయవాలకు నీచంగా వంగే భంగిమలు తెలియవు/ నేను సత్యాగ్రాహిని/ నా గుండెల్లో బద్దలవు తున్న అగ్నిపర్వతం/ నా గొంతులో గర్జిస్తున్న జలపాతం'. ఎగుడు దిగుడు సమాజం ఉన్నంత వరకు మనుషులకు సంఘర్షణ తప్పదు. సంఘర్షణే ఊపిరిగా బతకక తప్పదు. అనాది నుంచి ఈ సంఘర్షణే సాహిత్యానికి ముడి సరుకు.

మన భారతీయ సాహిత్యంలో తొలినాటి కావ్యాలు రామాయణ, మహాభారతాలు. వాల్మీకి విరచిత రామాయణం ఆదర్శ జీవితానికి అద్దం పడుతుంది. వ్యాసుడు రచించిన మహాభారతం వాస్తవ ప్రపంచాన్ని కళ్లకు కడుతుంది. ఆధునిక సాహిత్యంలోనూ అనేక రచనలకు ప్రేరణగా నిలిచిన కావ్యాలు రామాయణ, మహాభారతాలు. రామాయణ, మహాభారత గాథల నేపథ్యంలో దాదాపు అన్ని భారతీయ భాష ల్లోనూ అనేక కథలు, నాటకాలు, నవలలు వెలువడ్డాయి. కొన్ని సినిమాలుగా తెరకెక్కాయి. మన తెలుగు సాహిత్యం మహాభారత అనువాదంతోనే మొదలైంది. నన్నయ మొదలుపెట్టిన మహా భారత అనువాదాన్ని తిక్కన, ఎర్రనలు వేర్వేరు కాలాల్లో పూర్తి చేశారు. తెలుగులో మాత్రమే కాదు, మన దేశంలోని అన్ని భాషల్లోనూ తొలినాటి కవులు రామాయణ, మహాభారతాలను కావ్యాలుగా రాశారు. మన పొరుగు భాష కన్నడంలో పంపన 'విక్రమార్జున విజయం' రాశాడు. ఇది 'పంప భారతం'గా ప్రసిద్ధి పొందింది.

మహాభారతంలోనే కాదు, అమృతోత్సవ భారతంలోనూ అనేకానేక ఘర్షణలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. సంక్లిష్టమైన మానవ జీవితంలోని నిత్య ఘర్షణలను ప్రతిఫలించి, సమాజంలోని చెడును చెండాడి, మంచివైపు మొగ్గుచూపేదే ఉత్తమ సాహిత్యంగా కాలపరీక్షను తట్టుకుని తరతరాల వరకు మనుగడలో ఉంటుంది. కాలక్షేపం కోసం రాసే ఆషామాషీ రచనలు కాలప్రవాహంలో ఆనవాలే లేకుండా కొట్టుకుపోతాయి. 'రచయిత తాను వ్రాస్తున్నది ఏ మంచికి హాని కలిగిస్తుందో, ఏ చెడ్డకు ఉపకారం చేస్తుందో అని ఆలోచించవలసిన అవసరం ఉందని నేను తలుస్తాను. మంచికి హాని, చెడ్డకు సహాయమూ చెయ్యకూడదని నేను భావిస్తాను' అన్నారు రావి శాస్త్రి. భాషా ప్రాంతాలకు అతీతంగా రచయితలకు ఈ ఎరుక ఉండి తీరాలి. అలాంటి ఎరుక కలిగిన రచయితలు మనకు చాలామందే ఉన్నారు. అయితే, వారిలో గుర్తింపు కొందరికే దక్కుతోంది. ఒక ఎరుక కలిగిన రచయితకు గుర్తింపు దక్కినప్పుడు సాహితీ లోకం సంబరపడుతుంది. సుప్రసిద్ధ కన్నడ రచయిత ఎస్.ఎల్.భైరప్పకు 'పద్మభూషణ్' దక్కడం అలాంటి సందర్భమే!

ఆధునిక కన్నడ రచయితల్లో భైరప్పకు ప్రత్యేక స్థానం ఉంది. మహాభారత గాథ మర్మాలను విశదీకరిస్తూ, ఆనాటి ఆచారాలను, అంధ విశ్వాసాలను తుత్తునియలు చేస్తూ ఆయన రాసిన 'పర్వ' నవల ఆయనకు ఎనలేని ఖ్యాతిని తెచ్చిపెట్టింది. 'పర్వ'లో కోపోద్రిక్తురాలైన ద్రౌపది 'ఆర్య ధర్మ మంటే వేట, తాగడం, జూదం, ఆడవాళ్ల సహవాసం, స్వయంవరం పేరుతో రాచకన్యలను అపహ రించి పెళ్లాడటం, కనీసం పదిమంది దాసీలనైనా పెళ్లి కానుకలుగా తెచ్చుకుని వాళ్లతో సుఖించడం' అని నిరసిస్తుంది. 'పర్వ' నవలలో ఇదొక మచ్చుతునక మాత్రమే! ఇంత బట్టబయలుగా రాసేస్తే ఛాందసులు ఊరుకుంటారా? అందుకే, భైరప్పను కీర్తిప్రతిష్ఠలు వరించడంతో పాటు వివాదాలూ చుట్టుముట్టాయి. ఆయన రాసిన 'వంశవృక్ష', 'తబ్బలియు నీనాదె మగనె/ గోధూళి' వంటి రచనలపైనా వివాదాలు రేగాయి. 'వంశవృక్ష' తెలుగులో 'వంశవృక్షం' పేరుతో బాపు దర్శకత్వంలో సినిమాగా వచ్చింది. భైరప్ప 1996లో తన ఆత్మకథను 'భిత్తి' పేరుతో వెలుగులోకి తెచ్చారు. ఇది పదకొండు పునర్ముద్రణలను పొందింది. ఆయన నవలల్లో 'దాటు', 'పర్వ' వంటివి తెలుగులోనూ అనువాదం పొందాయి.

సంఘర్షణలమయమైన మహాభారతాన్ని 'పర్వ'గా అందించిన భైరప్ప జీవితంలోనూ అనేక ఘర్షణలు ఉన్నాయి. బాల్యంలోనే తల్లి, సోదరులు ప్లేగు వ్యాధికి బలైపోయారు. చిన్నా చితకా పనులు చేసుకుంటూనే ఉన్నత చదువులు చదివి, అధ్యాపక వృత్తిలో స్థిరపడ్డారు. స్వయంగా అనుభవించిన సంఘర్షణల వల్ల జీవితంపై తనదైన దృక్పథాన్ని ఏర్పరచుకుని, రచనా వ్యాసంగం మొదలుపెట్టి, సాహితీరంగంలో ఉన్నత శిఖరాలను అందుకున్నారు. సంఘర్షణలు రాటుదేల్చిన రచయిత చేసే రచనల్లో జీవన సంఘర్షణలు ప్రతిఫలిస్తాయి. అవి ఆ రచయిత రచనలను అజరామరం చేస్తాయి.

# వార్తా ప్రపంచంలో తనదైన ముద్ర వేసుకున్న పత్రిక "వి న్యూస్" సర్పంచ్ బొమ్మన బోయిన

**(వి న్యూస్, మండవల్లి) :** స్థానిక మండల పరిధిలోని సింగనపూడి గ్రామ పంచాయతీ కార్యాలయం నందు, సోమవారం సర్పంచ్ బొమ్మన బోయిన కనకదుర్గ , పిఎసిఎస్ సింగనపూడి అధ్యక్షులు బొమ్మన బోయిన ప్రసాద్ చేతుల మీదుగా, "వి న్యూస్ 2023 క్యాలెండర్" "ఘనంగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వార్తా ప్రపంచంలో తనదైన ముద్ర వేసుకున్న పత్రిక" వి న్యూస్" అని కొనియాడడం జరిగింది. మరియు సామాజిక సమతుల్యతకు వార్తా పత్రికల పాత్ర అతి ముఖ్యమైనదని



, వాటిలో" వి న్యూస్" తన పత్రిక తనదైన శైలిలో ముందుకు వెళ్తుందని ఉద్ఘాటించారు. రానున్న రోజుల్లో సామాజిక రుగ్మతలను కూకటి వేళ్లతో పెకిలించేలా మరింత పదునైన వార్తా కథనాలతో, వి న్యూస్ దినపత్రిక ముందుకెళ్లాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆవిష్కరణలో పంచాయతీ కార్యదర్శి రాధిక , , పంచాయతీ సిబ్బంది, వాలంటీర్లు మరియు స్థానిక "వి న్యూస్" దినపత్రిక ప్రతినిధి ఎన్. వి. ఆర్ రాజు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీజీ శాంతి మార్గం భావితరాలకు అనుసరణీయం

**(వి న్యూస్ తెనాలి):** గాంధీజీ శాంతి మార్గం భావితరాలకు అనుసరణీయమని సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ అన్నారు మహాత్మా గాంధీ 75వ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో అహింసా మార్గంతో దేశ ప్రజలందరినీ సత్యాగ్రహ సారథులుగా తీర్చిదిద్దిన మహాత్మా గాంధీ శాంతి మార్గం భావితరాలకు ఆదర్శమన్నారు ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు అదేవిధంగా మండల తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తాసిల్దార్ రవిబాబు గాంధీజీ చిత్రపటానికి




పూలమాలు వేసి నివాళి అర్పించారు ఇదిఇలాఉండగా మహాత్మా గాంధీ సేవ శాంతి ఆశ్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకులు వజ్రాల రామలింగాచారి ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని వృద్ధుల సేవలతో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా రామలింగ చారి మాట్లాడుతూ మహాత్మా గాంధీ ఆశయాలు శాంతి మార్గాలని ప్రపంచ దేశాలు ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళుతున్నాయని శాంతి కాముకుడిగా మహాత్మా గాంధీ ప్రపంచ దేశాల్లో ఆదర్శంగా నిలిచిపోతారని నివాళి అర్పించారు గాంధీజీ వర్ధంతిని పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లోనూ విద్యాసంస్థల్లోనూ ఘనంగా నిర్వహించారు

# వైజ్ఞానిక ప్రదర్శనలు నూతన ఆవిష్కరణలకు దోహదం చేస్తాయి

## - ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వి.సి. ప్రొఫెసర్ పి. రాజశేఖర్

**(వి న్యూస్ గుంటూరు) :** విద్యారంగంలో వైజ్ఞానిక ప్రదర్శలను ఏర్పాటు చెయ్యటం ఎంతైనా అవసరమని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య పట్టేటి రాజశేఖర్ అన్నారు. సోమవారం స్థానిక మార్కెట్ కూడలి లోని హిందూ కళాశాలలో ఆంధ్ర ప్రదేశ్రాష్ట్ర సైన్స్ సిటీ సౌజన్యంతో మూడు రోజుల పాటు జరుగనున్న సైన్స్ ఎక్స్పో-2023 ప్రారంభోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు కళాశాల ప్రిన్సిపాల్ పీఎం ప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి పట్టేటి రాజశేఖర్ మాట్లాడుతూ సైన్స్ ఎగ్జిబిషన్ లనేవి ఏర్పాటు చేస్తే వాటిలో పాల్గొనే విద్యార్థులు తమ మేథస్సు కు పదును పెడుతూ నూతన ఆవిష్కరణలను చేస్తుంటారని అందుకే ఇలాంటివి నిర్వహించటం ఎంతైనా అవసరమన్నారు. న్యూయార్క్ తదితర ప్రాంతాలలో ప్రతి సంవత్సరం తప్పని సరిగా ఒక ఉత్సవంలా సైన్స్ ఎగ్జిబిషన్లను పెడుతూంటారన్నారు. నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు మాట్లాడుతూ తాను హిందూ కళాశాల పూర్వవిద్యార్థినేనని తన కళాశాల 300 అంశాలతో నగరంలోని 100 పాఠశఋలలు, కళాశాలలను సమన్వయ పరచి ఎంతో



ఆసక్తికర అంశాలతో సైన్స్ ఎక్స్పోను ఏర్పాటు చెయ్యటం సంతోషదాయకమన్నారు. విద్యాలయాలు ఎగ్జిబిషన్లతో పాటు విద్యార్థులలో క్రీడల మీద ఆసక్తిని కలికించేందుకు స్పోర్ట్స్' మీట్ లను కూడా నేర్పాటు చెయ్యాలన్నారు. రాష్ట్రప్రభుత్వం విద్యారంగంలో విజ్ఞానాన్ని, క్రీడలను అభివృద్ధిచేసేందుకు తగిన పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఎంఎల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ తాను రెండున్నర దశాబ్దాల పాటు హిందూ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేసానని, ఎంతో గొప్ప చరిత్ర వున్న హిందూ కళాశాల అంతే గొప్ప స్థాయిలో సైన్స్ ఎక్స్పోను ఏర్పాటు చేయటం ఆనందంగా వుందన్నారు. సభలో కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణ మూర్తి, హెచ్సీహెచ్ఎస్ కౌన్సిల్ అధ్యక్షుడు గబ్బిట శివరామకృష్ణ ప్రసాద్, ఎక్స్పో కన్వీనర్ డాక్టర్ మన్నవ మాధవి, ఆంగ్ల శాఖ అధ్యాపకురాలు చిలకా అరుణ, వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్ తదితరులు ప్రసంగించారు. ఎక్స్పోలో పలు పాఠాశాలల విద్యార్థులు ఏర్పాటు చేసిన ఆసక్తికర అంశాలను చూడటానికి బారులు తీరిన విద్యార్థులతో ప్రాంగణ కిటకిటలాడింది. మంగళ, బుధవారాలలో కూడా ప్రదర్శన వుంటుందని ఎవరైనా ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల లోపు ఉచితంగా ప్రదర్శనను తిలకించ వచ్చని నిర్వాహకులు చెప్పారు. అయితే ట్రాఫిక్ సమస్య రాకుండా కాలేజికి ఎదురుగా వున్న వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సందర్శకులు తమ వాహనాలను నిలుపుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

# చల్లపల్లిలో అనుమతి లేకుండా అపార్ట్మెంట్ల నిర్మాణం

**(వి న్యూస్ విజయవాడ):** కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం చల్లపల్లి గ్రామంలో బస్టాండ్ సమీపంలోని పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం ప్రక్క రహదారిలో సర్వేనెంబర్ 134-15 , 16 లో ఎం .ఎస్ .వి కన్స్ట్రక్షన్ వారు నిర్మించిన అపార్ట్మెంటుకు, సంబంధించిన ఏ.పీ. సి. ఆర్ డి. ఏ విజయవాడ వారి అనుమతి



లేనందున ఆ అపార్ట్మెంట్ లోని ప్లాట్లను క్రయ విక్రయాలు జరుగుతున్నందున ఏ.పీ .సి .ఆర్. డి. ఏ యాక్ట్ 11 ఆఫ్ 2014 సెక్షన్ 114 (1)(డి) ప్రకారం ఏ.పీ .సి. ఆర్. డి. ఏ కమిషనర్ వివేక్ యాదవ్ వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోగలరని,కృష్ణా జిల్లా కలెక్టర్ కి స్పందనలో విన్నవించడం జరిగిందని, సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

# మాజీ ఎమ్మెల్యే జయ మంగళకు తృటిలో తప్పిన ప్రమాదం

**(వి న్యూస్ కైకలూరు) :** స్థానిక కైకలూరు నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే జయ మంగళ వెంకటరమణకు, స్థానిక మండల పరిధిలోని ఆలపాడు శివారు సోమేశ్వరం మరియు శ్రీకాంత్ ఇంటర్నేషనల్ పరిశ్రమ సమీపాన త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే... మాజీ ఎమ్మెల్యే జయమంగళ వ్యక్తిగత పనులు పై, భీమవరం వెళ్లి తిరిగి కైకలూరు వస్తున్న తరుణంలో, స్థానిక మండల పరిధిలోని ఆలపాడు గ్రామ శివారు సోమేశ్వరం , శ్రీకాంత్ ఇంటర్నేషనల్ పరిశ్రమ సమీపాన ఒక గుర్తు తెలియని బొలెరో వాహనం ఆయన కారును ఢీకొట్టడం జరిగింది. ఈ క్రమంలో ఆయన



ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురవడంతో, ఈ క్రమంలో కారు డ్రైవర్ చాకచక్యంతో వ్యవహరించడంతో, పెను ప్రమాదం నుంచి మాజీ ఎమ్మెల్యే జయ మంగళ బయటపడటం జరిగింది. ఈ క్రమంలో ఆయనకు కొంత అధిక గుండెపోటు రావడంతో, ఆయనను హుటాహుటిన ఆసుపత్రికి తరలించడం జరిగింది. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలియ వచ్చింది. దీనిపై స్థానిక పోలీసు వారు గుర్తుతెలియని బొలెరో వాహనం వెతుకులాట పనిలో నిమగ్నమయ్యారు . ఈ సందర్భంగా ఈ విషయంపై స్థానిక రూరల్ ఎస్సై చల్లా కృష్ణను "వి న్యూస్" ప్రతినిధి సంప్రదించగా, బొలెరో వాహనం కదలికలను నిఘా నేత్రాలలో పరిశీలించడం జరుగుతుందని, తదుపరి ఈ ప్రమాదంపై పూర్తి విచారణ జరుపుతామని తెలియజేయడం జరిగింది. ఇదిలా ఉంటే, ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యేవెంకటరమణ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు, నియోజకవర్గ ప్రజలు ఏ విధమైన ఆందోళన చెందవలసిన అవసరం లేదని, అయితే జరిగినది ప్రమాదమా!!! కావాలని చేసిందా !!! అనేది తెలియాలని, స్థానిక కార్యాలయం నుంచి ఒక సందేశాన్ని పంపించడం జరిగింది.

# రవాణాశాఖ ఉద్యోగుల సంఘం జోన్ 2 డైరీ ఆవిష్కరణ

## -జోన్2 డైరీ 2023ను ఆవిష్కరించిన డీటీసీ యం పురేంద్ర

**(విన్యూస్, విజయవాడ):** స్థానిక బందర్ రోడ్ లోని డిటిసి కార్యాలయంలో సోమవారంనాడు రవాణాశాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం రాజుబాబు ఆధ్వర్యంలో ఆ సంఘం జోన్2 డైరీ ని డీటీసీ యా పురేంద్ర ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా డిటిసి ఎం పురేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన సర్కులర్లను జీవోలను ఈ డైరీలో ప్రచురించడం ఉద్యోగులకు ఎంతో ఉపయోగపడుతుందని రోజువారి చేసేటివంటి విధి నిర్వహణలో కూడా దీని ద్వారా ఉద్యోగులకు అవగాహన పెరుగుతుందని ఆయన అన్నారు. సంఘం జోనల్ అధ్యక్షుడు యం రాజుబాబు మాట్లాడుతూ శాఖపరమైన విధి విధానాల అమలులో ఉద్యోగులకు అవగాహన ఉన్నప్పటికీని



ఒక్కొక్కసారి పూర్తిస్థాయిలో దానిమీద పనిచేయాల్సి వచ్చినప్పుడు దానికి సంబంధించి ప్రభుత్వం జీవోలు గాని సర్కులర్స్ గాని కావాల్సి వస్తాయని, అటువంటి వాటిలో ముఖ్యమైన సమాచారం ను కూడా అధికారులకు ఉద్యోగులకు అందుబాటులో ఉండే విధంగా కూడా ఈ డైరీని రూపొందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో ఆర్ జగదీశ్వర్ రాజు, శిక్షణ పొందుతున్న ఆర్టీవోలు ఎ సునీల్, వై చందన, జి మనీషా, టెక్నికల్ అధికారుల సంఘం నాయకులు ఆర్ ప్రవీణ్, వెంకటేశ్వరరావు సంఘం జోనల్ కార్యదర్శి కె వి వి నాగ మురళి, సహధ్యక్షురాలు జి ఉష సుందరి, ఏవోలు సిహెచ్ శ్రీనివాసరావు అబ్దుల్ సత్తార్ ఉద్యోగులు ఉన్నారు.

# అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం

## - సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

**(విన్యూస్, విజయవాడ):** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి విజ్ఞప్తి చేసేందుకు వెళుతున్న సిపిఐ నాయకులను వినుకొండలో పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు కె రామకృష్ణ నేడు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈరోజు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వినుకొండ పర్యటన సందర్భంగా పల్నాడు ప్రాంత ప్రజల, రైతుల సమస్యలను విన్నవించేందుకు సిపిఐ జిల్లా నాయకత్వం వెళుతుండగా పోలీసులు అడ్డుకొని అక్రమంగా అరెస్టు చేశారు. సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఏ మారుతి వరప్రసాద్, వినుకొండ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఉలవపూడి రాము పోలీసులు అక్రమంగా అరెస్టులు, గృహనిర్బంధాలు చేశారు.

# ఈడేపల్లి శాఖ గ్రంథాలయానికి కంప్యూటర్ వితరణ



**(విన్యూస్ – మచిలీపట్నం ):** తెలంగాణ చీఫ్ సెక్రటరీ అల్లం శెట్టి శాంత కుమారి మామయ్య, అత్తయ్య అయిన తోట జగన్నాథ రావు, తోట స్వరాజ్యలక్ష్మి ల జ్ఞాపకార్థంగా ఈడేపల్లి శాఖ గ్రంథాలయానికి కొత్త కంప్యూటర్ బహుమతి గా అందజేయడం జరిగింది .. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి , ఈడేపల్లి శాఖ గ్రంథాలయ నిర్వాహకురాలు కోన వెంకటేశ్వర మ్మ కృతజ్ఞతలు తెలిపారు.

# జాతిపిత మహాత్మాగాంధీ 75 వ వర్ధంతి



**(వి న్యూస్ మచిలీపట్నం):** జాతిపిత మహాత్మాగాంధీ 75 వ వర్ధంతి సందర్భంగా మచిలీపట్నం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నివాళి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ బాబా ప్రసాద్, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఇలియాస్ పాషా, కార్యదర్శి వెంకన్న, కార్పొరేటర్లు రాళ్లకొట్టు రాము, డిద్ధకుంట సుధాకర్, బీసీ సెల్ అధ్యక్షులు గోకుల్ శివ, అంగన్వాడీ అధ్యక్షురాలు సులోచన, ఐటీడీపీ పామర్థి లక్ష్మణ, డివిజన్ ఇంఛార్జి మురాల ప్రసాద్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విజ్ఞాన్స్ యూనివర్సిటీతో జోహో అవగాహన ఒప్పందం




**(వి న్యూస్ చేబ్రోలు):** చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీతో తమిళనాడు రాష్ట్రంలో చెన్నై ప్రధాన కార్యాలయంగా పనిచేసే గ్లోబల్ టెక్నాలజీ కంపెనీ జోహో కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సోమవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జోహో కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రోడక్ట్ మార్కెటింగ్ లీడ్ ఎస్.మీర, టీమ్ లీడ్ కే.మణికందరాజ్‌లతో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వలన జోహో కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ వారు సరికొత్తగా రూపొందించిన "జోహో యంగ్ క్రియేటర్" ప్రోగ్రామ్‌లో రిజిస్టరైన విద్యార్థులకు ఆన్‌లైన్‌తో పాటు ఫిజికల్ ట్రైనింగ్‌ని కూడా అందించి యాప్స్‌ను అభివృద్ధి చేయడంలో సహాయపడతారన్నారు. అంతేకాకుండా ఈ ప్రోగ్రామ్‌లో రిజిస్టర్ అయిన విద్యార్థులకు ఉచితంగా స్టూడెంట్ ఎడిషన్ లైసెన్స్‌ను ఇవ్వడంతో పాటు ట్రైనింగ్ మెటీరియల్‌ను కూడా అందజేస్తుందన్నారు. యంగ్ క్రియేటర్ ప్రోగ్రామ్‌ను విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లతో పాటు అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన వారికి నగదు బహుమతులను కూడా అందజేస్తారని పేర్కొన్నారు. వీటితో పాటు అకడమిక్, పరిశోధన, ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్స్‌ను అభివృద్ధి చేస్తారని వెల్లడించారు. విద్యార్థులకు, అధ్యాపకులకు ఉపయోగపడే విధంగా పరస్పర అవగాహనతో యూనివర్సిటీ లో కానీ, వర్చువల్‌గా కానీ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తారని తెలియజేసారు. ఈ సందర్భంగా జోహో కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రోడక్ట్ మార్కెటింగ్ లీడ్ ఎస్.మీర మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులు ఇండస్ట్రీ లేదా వృత్తితో సంబంధం లేకుండా డిజిటల్ ప్రపంచంలో వస్తున్న సాంకేతికతను స్వీకరించాలన్నారు. యంగ్ క్రియేటర్ ప్రోగ్రామ్ ద్వారా జోహో టీమ్ నిపుణులు సాంకేతికంగా ఎదురయ్యే సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించే నైపుణ్యాలను విద్యార్థులకు అందించి భవిష్యత్తు నాయకులుగా వారిని శక్తివంతం చేయడమే మా లక్ష్యమని తెలియజేసారు. విద్యార్థులకు నైపుణ్యాలను పెంచే ప్రయత్నంలో విజ్ఞాన్స్ విశ్వవిద్యాలయంతో భాగస్వామి అయినందుకు మేము సంతోషిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.


V స్మార్ట్ యాడ్స్

**Insurance**

యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా అన్ని రకాల వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించబడును. ఇన్సూరెన్స్ చేయించుకోదలచిన వారు సంప్రదించండి: టి.సి.ఎన్ శ్రీనివాస్. 9246761404 08672-221097

**వి స్మార్ట్ యాడ్స్ కేవలం రూ.100/-లకే స్మార్ట్ యాడ్..**

సంప్రదించండి 9848667347

**శ్రీ శివరామకృష్ణ జ్యోతిష్యాలయము**

శంకర మఠం ప్రక్కన, గొడుగుపేట, మచిలీపట్నం.

జాతక పరిశీలన చేసి వివాహ, ఉద్యోగ, వ్యాపార, సంతాన తదితర విషయాల్లో దోషాలకు పరిహారాలు సూచింపబడును.

వివాహ పొంతన పరిశీలింపబడును. సుముహూర్త నిర్ణయం చేయబడును.

సంప్రదించండి : 96407 54054-91828 17435

**తక్కువధరకే ప్రకటనలు**

ఇల్లు/స్థలం అమ్మలన్నా, కొనాలన్నా, అద్దెకు ఇవ్వాలన్నా, ఉద్యోగం కావాలన్నా, ఉద్యోగులు కావాలన్నా తక్కువ ధరతో విన్యూస్‌లో ప్రకటన ఇచ్చి నిశ్చింతంగా ఉండండి. మరిన్ని వివరాలకు సంప్ర: 9848667347

**మస్కిటో డోర్స్&విండోస్**

చక్రిస్ మస్కిటోడోర్స్&విండోస్... అల్యూమినియమ్ మస్కిటో డోర్స్&విండోస్ తయారు చేయబడును. మరియు రిపేర్ చేయబడును.

సంప్రదించండి: చక్రిస్ మస్కిటోడోర్స్&విండోస్ గొడుగుపేట-మచిలీపట్నం సెల్:9182197822 9121605277

**ఆర్గానిక్ తేనె**

సెల్: 7981850205



**ఆర్గానిక్ తేనె**

మచిలీపట్నంలో... ఆర్గానిక్ తేనె కోసం సంప్రదించండి: 7981850205

**అమ్మబడును**

మచిలీపట్నం శివారు రాడార్ కేంద్రం దగ్గర కళ్యాణీటౌన్‌షిప్‌లో 300గజాల ఫ్లాట్ అమ్మబడును. కావల్సిన వారు సంప్రదించండి: సెల్: 7032931205 సంప్రదించు వేళలు: ఉదయం11 - 2పిఎం

**అద్దెకు ఇవ్వబడును**

జిల్లా కోర్టు సాయిబాబాగుడి ఎదురురోడ్డులో తూర్పు ఫేస్‌లో 1,2 ఫ్లోర్లలో కమర్షియల్ స్పేస్ అద్దెకు ఇవ్వబడును. బ్యాంకులకు, డాక్టర్లకు మొ॥లగు వారు సంప్రదించండి. లిఫ్ట్ సౌకర్యం కలదు.

సంప్రదించండి: 7997883575 9347576464 9515237110

మచిలీపట్నం పరిసర ప్రాంత ప్రజలకు సదవకాశం

వాటర్ సర్వీసింగ్ & ఇంజన్ ఆయిల్ (జనరల్ సర్వీస్‌తో)

కేవలం రూ. 449/-లకే బైక్ జాబ్ కార్డు ఇవ్వబడుతుంది.

ప్రతి ఒక్కరు ఈ అవకాశమును వినియోగించుకోవలసినదిగా మనవి.

**నందిని ఆటోమొబైల్**

అన్నిరకముల టూవీలర్ స్పేర్ పార్ట్స్ & ఇంజన్ ఆయిల్స్ మరియు టైర్లు లభించును.

సెల్ : 7396 7396 79

**నవరంగ్ ఆటో కన్సల్టెన్సీ**

లక్ష్మీటాకీస్ సెంటర్, డి-మార్టు రోడ్, మచిలీపట్నం - 521 002.

సెల్ : 9848520822



**వంట మనిషి కావలెను**

మచిలీపట్నం జల్లువారితోట డీమార్టు వెనుక నలుగురు గల కుటుంబంనకు వంట మనిషి కావలెను. (నాన్‌వెజ్) సంప్రదించండి: (ఉదయం10 నుంచి2గంటల) సెల్:7032931205

**స్థలం అమ్మబడును.**

డోకిపర్రు వెంకటేశ్వరస్వామి గుడి సమీపంలో నిడుమోలు-కౌతవరం మెయిన్ రోడ్డులో 16సెంట్ల భూమి అమ్మకానికి కలదు. 60-120 సైజులో గల కమర్షియల్ భూమి కావల్సిన వారు వెంటనే సంప్రదించండి:

సంప్రదించండి: 7997883575 9347576464


# నవ కాంతి సొసైటీ ఆధ్వర్యంలో బోరింగ్ పంపు లు ఏర్పాటు



**(వి న్యూస్ మచిలీపట్నం):** నవ కాంతి సొసైటీ మచిలీపట్నం వారు ప్రజల నీటి అవసరాలు తీర్చుటకు సోమవారం బంటుమిల్లి మండలంలో ని అర్తమూరు కాలనీ, పుల్లపాడు గూడూరు మండలం లో రామన్నపేట, రాయవరం లో బోరింగ్ పంపు లు ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమంలో సంస్థ జనరల్ సెక్రటరీ పల్లికొండు మణిలాల్, జస్మారనా, మెరిట్ బాబు, సురేష్ బాబు, నాని బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జాతిపిత మహాత్మా గాంధీ 75 వర్ధంతి



**(వి న్యూస్ పెడన):** పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వాసవి క్షేత్రము నందు జాతిపిత మహాత్మా గాంధీ 75 వర్ధంతిని ఘనంగా నిర్వహించారు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొల్లూరి చిన్న జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొల్లూరి చిన్న మాట్లాడుతూ భారతదేశం స్వేచ్ఛ స్వతంత్రం కోసం అహింసా మార్గం ద్వారా అనేక ఉద్యమాలు చేసి బ్రిటిష్ సామ్రాజ్యవాదుల కబంధహస్తాల నుంచి భారతదేశాన్ని రక్షించిన ఉద్యమకారులు జాతిపిత మహాత్మా గాంధీ అని చిన్న అన్నారు. మహాత్మా గాంధీ ఆశయాలు ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచాయి అని అన్నారు. మహాత్మాగాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చిన్న అన్నారు ఉత్సవములు కమిటీ కన్వీనర్ కొల్లూరి రాధాకృష్ణ గుప్తా కార్యవర్గ సభ్యులు జల్లూరి సత్యనారాయణ సభ్యులు పాదర్తి శ్రీను తుమ్మలపల్లి కేశవరావు కొల్లిపర శ్రీను మామిడి ఆనంద్ జల్లూరి నిహాన్ సేవకుడు నాగరాజు పట్టణ శ్రీ వాసవి మహిళా మండలి సభ్యులు జల్లూరి అమ్మాజీ జల్లూరి మాధురి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటాక్ భారత జాతీయ కళా సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ సంస్థ నిర్వహించిన చిత్రలేఖన పోటీలు



**(వి న్యూస్ మచిలీపట్నం):** స్థానిక జవ్వారు పేట లోని రామ కృష్ణా ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో ఇంటాక్ భారత జాతీయ కళా సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ సంస్థ మచిలీపట్నం చాప్టర్ వారు వారసత్వం పై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు 120మంది విద్యార్థిని విద్యార్థులు ఎంతో ఉత్సాహం గా పాల్గొన్నారు మెరుగైన ప్రదర్శన కనబరచిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు సంస్థ కన్వీనర్ డా ఉడత్తు శ్రీనివాసరావు అందచేశారు. డా. ఉడత్తు మాట్లాడుతూ ఇటువంటి పోటీలవల్ల విద్యార్థులలో సృజనాత్మక శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం లో డా. ఉడత్తు శ్రీనివాసరావు,మాజేటి లక్ష్మి కాంతం, యెండూరి వెంకట సుధ, తాడేపల్లి విజయ లక్ష్మి,పాఠ శాల అధినేత చిత్త జల్లు రామ కృష్ణా రావు ప్రిన్సిపాల్ సి సంధ్యా రాణి తదితరులు పర్యవేక్షించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా ముందుకెళుతున్న దినపత్రిక "వి న్యూస్" :: వేంద్ర... చేబ్రోలు...







**(వి న్యూస్ మండవల్లి) :** స్థానిక మండల పరిధిలోని పులపర్రు, తక్కెళ్ళపాడు గ్రామాల సర్పంచులు.. వేంద్ర నాగరాజు , చేబ్రోలు సుధారాణి లు వారి వారి గ్రామ సచివాలయ కార్యాలయాల వద్ద "వి న్యూస్ 2023 క్యాలెండర్" ను ఘనంగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నవ సమాజ అభివృద్ధికి పునాదులు వార్తాపత్రికలుగా అభివర్ణించడం జరిగింది. ఈ సందర్భంగా "వి న్యూస్" దినపత్రిక ప్రాముఖ్యతను తెలియజేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంలో తనదైన ముద్ర వేసుకున్న పత్రిక" వి న్యూస్" అని నొక్కి వక్కాణించడం జరిగింది. తనదైన శైలిలో ప్రత్యేక కథనాలను పాఠకులకు అందిస్తూ, ప్రజలను చైతన్య పరిచే సరళమైన దినపత్రిక వి న్యూస్ అని వారు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం. కొండలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పలువురు వైసిపి నాయకులు, గ్రామ పెద్దలు , స్థానిక "వి న్యూస్" దినపత్రిక ప్రతినిధి ఎన్. వి. ఆర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# భారత్ లో సామరస్యమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం : డిసిసి మైనార్టీ అధ్యక్షుడు ఆడిర్ మన్సూర్ అలీ ఖాన్



**(వి న్యూస్ రాయచోటి):** జాతీయ కాంగ్రెస్ పార్టీ యువ నేత, ఎంపీ రాహుల్ గాంధీ భారత్ జూడో యాత్ర ఎంతో ప్రతిష్టాత్మకంగా సెప్టెంబర్ 7న మొదలైన పాదయాత్ర విజయవంతం కావడంతో సోమవారం ముగింపు సందర్భంగా డిసిసి మైనార్టీ అధ్యక్షుడు ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్ రాయచోటికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న వృద్ధాశ్రమం ప్రేమాలయంలో మూడు రంగుల జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మన్సూర్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర అఖండ విజయం సాధించడంతో, విజయవంతం కావడంతో నేడు కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో ఎంతో ఉత్సాహం, ఆనందంగా కలిగిందన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి కమల, ఆపిల్, దానిమ్మ మూడు రకాల పండ్ల 100 కిట్లను వృద్ధులకు పంపిణీ చేసి అనంతరం మహాత్మా గాంధీ దేశానికి చేసిన సేవలను ఆయన కొనియాడారు. ఆ తర్వాత 'హాత్ సే హాత్ జోడు అభియాన్' కరపత్రాలను అందరికీ పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షల మంది నిరుపేదల సమస్యలను తెలుసుకోవడానికి, వారి కష్టాలను తొలగించడానికి,మత సామరస్యమే ప్రధాన ఎజెండాగా సాగిన ఈ యాత్ర విజయవంతం కావడంతో ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉన్న రాహుల్ గాంధీ ముఖంలో ఎన్నికల విజయ రేఖలు స్పష్టంగా కనిపిస్తున్నాయి అన్నారు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి ఈ దేశానికి ప్రధాని అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సెక్రటరీ, మన్సూర్ విక్టోరియాస్ , జాకీర్ భాష, ఆసిఫ్ , ఇలియాస్, సద్దాం , మైనార్టీ నాయకులు హాఫిజుల్లా, హబీబుల్లా, జిలాని భాష, ఆష్రఫ్ అలీ, గౌస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# ఉయ్యూరు వీరమ్మ తల్లి చరిత్ర...



**(వి న్యూస్ మచిలీపట్నం):** వీరమ్మ తల్లి చరిత్ర వీరమ్మ తల్లి తిరునాళ్ళు ఉయ్యూరు వీరమ్మ తల్లి తిరునాళ్ళు పుట్టి నింటి నుంచి మెట్టి నింటికి తిరునాళ్ళు వీరమ్మ తల్లి కి అయిదు వందల సంవత్సరాల చరిత్ర వుంది .ఆ కాలమ్ లో పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరుకు దగ్గర పెద కడియం అనే గ్రామం లో యాదవ కులానికి చెందిన ''బొడ్డు ''వారి ఆడ పడుచు గా ఆమె జన్మించింది .తండ్రి పరశురామయ్య ,తల్లి పార్వతమ్మ .పరమేశ్వర వర ప్రసాదం గా జన్మించి నందున ''వీర శివమ్మ ''అని పేరు పెట్టారు .చిన్న తనం నుంచి భక్తీ శ్రద్ధ లతో ,దైవ చింతన తో పెరిగింది .ఉయ్యూరు గ్రామానికి చెందిన యాదవ దంపతులు పారుపూడి చలమయ్య ,చెల్లమ్మ ల పెద్ద కుమారుడు చింతయ్య తో ,ఆమె ఎనిమిదవ ఏట జ్యేష్ట శుద్ధ దశమి నాడు ,పెదకడియం లో ఆమెకు వివాహం చేశారు .కొంత కాలమ్ పుట్టింట్లో నే వుంది ,యుక్త వయసు రాగానే ఉయ్యూరు లోని మెట్టి నింటికి సంసార జీవన మాధుర్యాన్ని అనుభవించ టానికి పుట్టి నింటి వారు పంపారు .అత్త వారింట్లో అందరి అభిమానాన్ని ,ఆదరాన్ని పొందింది వీరమ్మ .తన సేవా తత్పరత తో అత్త గారైన మేనత్తను ,మామయ్యను మెప్పించింది .మరది భోగయ్య ను బిడ్డ లాగ చూసింది .చుట్టు పక్కల వారికే కాక బంధు గణానికీ అంతటికీ ఆమె ''ఉత్తమా ఇల్లాలు ''అయింది .భర్త సేవలో జీవితం ధన్యం చేసుకోంది .కాలమ్ ప్రశాంతం గా గడిచి పోతోంది .ఇంతలో కుటుంబం లో ఒక అలజడి రేగింది .మరది భోగయ్యకు అచ్చమ్మ తో వివాహ మైంది .ఆమె గర్విష్టి ,విద్యా హీన .ఆమెకు వీరమ్మ మీద అసూయా పెరిగింది .ఊరందరూ తోడి కోడలు వీరమ్మను మెచ్చు కోవటం ఆమె కు బాధ కలిగి అలిగి పుట్టింటికి చేరింది .అయితె సాధ్వి వీరమ్మ ,అత్త మామలకు ,మరిదికి నచ్చ చెప్పి ,తోడి కోడల్ని ,మళ్ళీ అత్త వారిల్లు చేరేట్లు చేసింది .ఆమె మనసు లోని అసూయా తొలగి పోయి ,తోడికోడళ్ళు అన్యోన్యం గా వుంటూ ,వూరి వారికి ఆదర్శ మైనారు .

### భర్త మరణం –సహగమనం

ఉయ్యూరు గ్రామం లో ,కరణం సుబ్బయ్య కు స్త్రీ వ్యామోహం ఎక్కువ .అతని కళ్ళు సాధ్వీ మణి వీరమ్మ పై పడ్డాయి .లోబరుచు కోవటానికి ఎన్నో ప్రయత్నాలు చేశాడు .దగ్గర లో వున్న'' గురజాడ ''గ్రామం లోని తన బావ మరిది ''సీతయ్య ''ను తనకు సాయం చేయమని బ్రతిమి లాడాడు .అతడు రావణాసురుడికి మారీచుడు చేసి నట్లు హిత బోధ చేశాడు .చెవి కెక్క లేదు .ఎంతైనా బావ గారు కదా తన సోదరి కాపురం ఏమవుతుందో ననే భయం సీతయ్య కు పట్టు కొంది .మంత్ర తంత్రాలు తెలిసిన సీతయ్య మెత్త బడి చివరికి సాయం చేయ టానికి ఒప్పు కున్నాడు .మేకల ,గొర్రెల మేత కోసం చింతయ్య ,భోగయ్య సోదరులు వాటిని తోలు కోని ఉత్త రాదికి అంటే బెజవాడ అవతలి ప్రాంతాలకు వెళ్ళారు .ఇదే అదునైన సమయం అని బావమరిది సీతయ్య ను ప్రేరేపించాడు బావ సుబ్బయ్య .సీతయ్య ప్లాన్ వేశాడు .తన నౌకరుకు విషం పూసిన సొర ముల్లు ఇచ్చి ,చింతయ్య పై రహశ్యం గా ప్రయోగించమని చెప్పి పంపాడు .ముస్తాబాద్ లో గొర్రెల మందల దగ్గర నిద్ర పోతున్న చింతయ్యను ఆ నౌకరు విషం వున్న ఆ సొర ముల్లు తో పొడిచి హత్య చేశాడు . .చింతయ్య బాధ భరించ లేక చని పోయాడు .తమ్ముడు భోగయ్య అన్న శవాన్ని ఉయ్యూరు చేరుస్తాడు . ఈ వార్త విని వీరమ్మ తల్లడిల్లి పోతుంది .తాను గాడం గా ప్రేమించిన భర్త తో సహ గమనం చేయాలని నిస్చ యించుకొంది .తన భర్త హత్యకు కారణం సుబ్బయ్య అని తెలుసు కోని ,అతని వంశం నిర్వంశం కావాలని శపించింది .సుబ్బయ్య అకస్మాత్తు గా చని పోయాడు .అతనితో అతని వంశము అంతరించింది .వీరమ్మ పుట్టినింటి వారు ఈమెను మళ్ళీ పెళ్లి చేసుకోమని బల వంత పెట్టారు .ఆమె కు కోపం వచ్చి పుట్టి నింటి వారిని కూడా ''నిర్వంశం ''కావాలని శాపంపెట్టింది . సతీ సహగమనానికి ఉయ్యూరు జమీందారు ,గోల్కొండ నవాబు ప్రతినిధి ''జిన్నా సాహెబ్ ''అంగీకరించారు .వీరమ్మ మహిమలు వెంట వెంటనే బయట పడుతూ ,ఆమె అంటే అందరి లో భక్తీ ఏర్పడింది . చింతయ్య కు చితి ఏర్పాటు చేయించారు .వీరమ్మ కు అగ్ని గుండం ఏర్పాటు అయింది .గుండం తవ్వ టానికి ఉప్పర కులస్తులు ఒప్పుకోక పోతే ,మాదిగ వారు వచ్చి తవ్వారట అందుకే సిడి బండి నాడు ఆ కులానికి ప్రాధాన్యత ఏర్పడింది .ముత్తైదువులు పసుపు దంచుతుంటే ,రోలు పగిలింది .వీరమ్మ తల్లి మోకాలు అడ్డు పెట్టి ,తానూ రోకటి పోతూ వేసింది .ముత్తైదువులకు పసుపు ,కుంకుమ లు పంచి పెట్టింది .ఆమె దంచిన రోలు ఇప్పటికీ ఆలయం దగ్గర కన్పిస్తుంది .చింతయ్య చితికి తమ్ముడు భోగయ్య నిప్పు అంటించాడు .వేలాది ప్రజలు భోరున విల పిస్తుండగా ,అత్తా మామలు ,బంధు గణం శోక సముద్రం లో మునిగి ఉండ గా పుణ్య స్త్రీలతో, తోడి కొడాలి తో ,''పారెళ్ళు ''పెట్టించుకొని ,పెళ్లి కూతురు లా ,పుష్పాలతో శిరోజాలను అలంకరించు కోని ,సాధ్వీమ తల్లి ,పతివ్రతా శిరోమణి ,వీరమ్మ తల్లి ,భర్త చితికి మూడు సార్లు ప్రదక్షిణం చేసి ,భగ భగ మండే ఆ మంటలో తానూ ,భర్త చితి పై చేరి అగ్ని గుండం లో సహ గమనం చేసింది .ఆదర్శ మహిళ గా ,మహిమ గల తల్లి గా ఆనాటి నుంచి ,ఈనాటి వరకు ప్రజల నీరాజనాలు అందు కొంటోంది. రాజ ప్రతినిధి ''జిన్నా సాహెబ్' వీరమ్మ నమస్కారం చేసి ,ఇంటికి వెళ్లి నిద్ర పోయాడు .ఆ రాత్రి నిద్ర లో వీరమ్మ భర్త చింతయ్య తో సహా మహా తేజో వంతం గా ,సర్వాలంకార శోభ తో ,కన్పించింది .స్త్రీలు పూజలు చేస్తున్నట్లు ,వీరమ్మ వారి కోర్కెలు తీరుస్తున్నట్లు ,గండ దీపాల కాంతి లో అమ్మ తల్లి ,ఒక దుష్ట శక్తిని కాలితో తన్నుతూ ఉయ్యాల ఊగు తున్నట్లు గుడి పక్కనే పెద్ద తటాకం వున్నట్లు ,అందులో వికసించిన తామర పూలున్నట్లు సాహెబ్ గారికి కల లో కన్పించిందట .ఉదయం లేచి జమీందారు ను పిలి పించారు .జమీందార్ కు కూడా అలాంటి స్వప్నమే వచ్చి నట్లు చెప్పారట చింతయ్య మరణానికి కారకు లెవరో తెలుసు కోవ టానికి వేగుల్ని పంపారు .సుబ్బయ్యే కారణం అని అమ్మ వారి సహ గమనం రోజే తీవ్ర మైన బాధ తో అతడు మరణిం చాడని తెలుసు కున్నారు .సుబ్బయ్య వంశం సర్వ నాశనమై చివరికి వారసులెవరు లేకుండా నిర్వంశం అయింది.

### ఆలయ నిర్మాణం –తిరునాళ్ళఏర్పాట్లు

అందరూ ఆలోచించి ,వీరమ్మ అత్త మామ ల తో సంప్రదించి ,గ్రామస్తులతో సమా వేశం జరిపి ,సహగమనం జరిగిన చోటు లో ఆలయాన్ని నిర్మించారు .చెరువు తవ్వించారు .వీరమ్మ ,చింతయ్య లవిగ్రహాలను ఉయ్యాల స్తంభాలను తయారు చేయించారు .జిన్నా గారు ,జమీందారు గార్ల సమక్షం లో భక్త జన సందోహం మధ్య వైభవం గా ప్రతిష్ట జరిగింది .ఆలయం ఉయ్యాల స్తంభాల ఖర్చును జిన్నా గారే పెట్టు కొన్నారు .చెరువును తవ్వించిన ఖర్చు ,ప్రతి ఏటా మాఘ శుద్ధ ఏకాదశి నుండి పదిహేను రోజులు పాటు జరిగే ఉత్సవ ఖర్చు జమీందారు భరించారు .ఆ నాటి నుంచి ముందుగా మెట్టి నింటి వారు తర్వాత జిన్నా గారు రాజు గారు తర్వాత గ్రామస్తులు అమ్మ వారి ఉత్స వాలను ప్రారంభించి కొన సాగించారు .పారు పూడి వంశం వారినీ ,జమీందారు గారినీ ,ప్రభుత్వాధి కారులని ధర్మ కర్తలు గా జిన్నా గారు నియమించారు .అంటే వీరమ్మ తల్లి తిరుణాలను ప్రభుత్వ పరం గా నిర్వ హించే ఏర్పాటు చేశారన్న మాట .అందుకే నేటికీ పోలీసు వారిచ్చే పసుపు కుంకుమ చీరే సారే లతో సంబరాలు ప్రారంభ మవటం ఆన వాయితీ గా వస్తోంది .

అమ్మ వారు ఉయ్యాల ఊగే ప్రదేశం లో ఏ కట్టడమూ వుండదు .తన భర్తనూ హత్య చేయించిన కిరాతకుడు సుబ్బయ్య ను కాలితో తన్ని,చిరు నవ్వు చిన్దిస్తున్నట్లు ఉయ్యాల ఊగటం లో అంత రార్ధం .ఆమె సహగమనం చేసిన రెండు మూడు రోజులకే మాఘ శుద్ధ ఏకాదశి రావటం అదే భీష్మ ఏకాదశి కావటం ఆ రోజూ నుంచే ఉత్స వాలు ప్రారంబించటం జరుగు తోంది . చరిత్ర కాల గర్భం లో కలిసినా ,వీరమ్మ తల్లి మహిమలు నిత్య నూతనం .నమ్మిన వారికి నమ్మి నంత శుభం చేకూర్చే తల్లి వీరమ్మ .తిరునాళ్ళు పదిహేను రోజుల్లో ను ,ఉయ్యూరు లో ఏ ఇంట్లోను పసుపు దంచరు ,కుంకుమ తయారు చేయరు .ముందే సిద్ధం చేసు కొంటారు .కారం కూడా కొట్టరు .ఇవి స్వచ్చందం గా అందరు పాటించే నియమాలే .తిరునాళ్ళ లో అమ్మ వారికి సాధారణం గా అందరు చీరే పసుపు కుంకుమ పెట్టటం అలా వాటు .అంతే కాక ఆ తర్వాత ఎవరింట్లో నైనా వివాహం లాంటి శుభ సందర్భాలు వచ్చి నప్పుడు కూడా చీరా సారే పెడుతుంటారు మెట్టి నింట్లో వున్న అమ్మ వారికి ''.అమ్మ వారి చీరలు'' అని ప్రత్యేకం గా అందరికి అందు బాటైన ధరలో ప్రతి వస్త్ర దుకాణం లో ను లభిస్తాయి .ఆమె పవిత్రత ను ఇలా తర తరాలుగా పాటిస్తూ ,నేటికీ నిల బెట్టు కొంటు న్నారు ఉయ్యూరు ,పరిసర గ్రామాల వారు .అమ్మ వారి ఊరేగింపులో జనరేటర్ తో అమర్చే విద్యుత్ బల్బుల శోభ ఆకట్టు కొంటుంది .యాదవ కులస్తులు తిరునాళ్ళ రోజుల్లో వివాహాలు చేయరు .పెళ్లి అయిన వాళ్ళు కూడా ,ఆ పవిత్ర దినాలలో బ్రహ్మ చర్యం పాటించి ,వంశ ప్రతిష్ట ను నిల బెట్టు కొంటారు. బంధువులను పిల్చుకొని విందు భోజ నాలు ఏర్పాటు చేసు కొంటారు .అంతా పెళ్లి శోభ లాగా వుంటుంది .ఇప్పటికీ పారు పొడి వంశాస్తులే ఆలయ పూజార్లు .ఆలయానికి చాలా ఎకరాల పంట పొలాలున్నాయి . ఇదే వీరమ్మ తల్లి పుణ్య చరిత్ర...సర్వేజన సుఖినోభవంతు..

గడ్డం.రాజు యాదవ్

# గోపువాని పాలెం అక్రమ తవ్వకాలపై హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసిన జనసేన కార్యకర్తలు

## - కృష్ణా జిల్లా కలెక్టర్ నివేదిక కోరుతూ ఫిబ్రవరి 6 కి వాయిదా



**(వి న్యూస్ మచిలీపట్నం):** మచిలీపట్నం నియోజకవర్గ గోపువాని పాలెం లో అక్రమ ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని కోరుతూ దాఖలు అయినా రిట్ పిటిషన్ లో కృష్ణా జిల్లా కలెక్టర్ తీసుకున్న చర్యలు రాష్ట్ర హైకోర్టుకు తెలియపరచాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సోమవారం ఆదేశాలు జారీ చేసింది. సముద్ర తీర ప్రాంతంలో నివసిస్తున్న గోపువాని పాలెం గ్రామంలో అక్రమ ఇసుక త్రవ్వకాలు వలన, తమకు సముద్రం వల్ల ముప్పు ఉందని, అక్రమ తవ్వకాలు నిలిపివేయాలని, గోపువాని పాలెం చెందిన జనసేన పార్టీ కార్యకర్తలు కృష్ణాజిల్లా లో అధికారులు పై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర హైకోర్టులో రిట్ పిటిషన్ 1962/2023 హైకోర్టు న్యాయవాది చామర్తి సాయి గంగాధర్ ద్వారా దాఖలు చేశారు. పేపర్లో ప్రచురించిన కథనాలను కూడా పిటిషనర్లు హైకోర్టు దృష్టికి తీసుకువచ్చారు. కేసు విచారణ స్వీకరించిన రాష్ట్ర హైకోర్టు ఈ విషయంపై కలెక్టర్ ఏం చర్యలు తీసుకున్నారో హైకోర్టు తెలియపరచాలని కేసు ఫిబ్రవరి 6వ తేదీకి వాయిదా వేశారు.

# సర్వ జన ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలి



**(వి న్యూస్ మచిలీపట్నం):** సర్వ జన ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ కె. విజయ్ కుమారి కి, బి.సి సంక్షేమ సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షులు శేకు బోయిన సుబ్రహ్మణ్యం సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఏర్పడిన సర్వజన ఆసుపత్రి లో ప్రజలు మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఆశించడం జరిగిందన్నారు. కానీ అందుకు భిన్నంగా రిఫరల్స్ అధికంగా వెళ్లడం పట్ల సర్వత్ర ఆందోళన వ్యక్తం అవుతొందన్నారు. అలాగే ఆస్పత్రిలో కంటి శస్త్ర చికిత్సలు జరగకపోవడం వల్ల రోగులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. అంతేకాకుండా ఆసుపత్రిలో ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్, వార్డుల ను సూచించే బోర్డులు ఆంగ్లంలో ఉండడంవల్ల రోగులు గందరగోళానికి గురవుతున్నారని వివరించారు. సంబంధిత అంశాల ను పరిగణలోకి తీసుకొని తగిన నివారణ చర్యలను చేపట్టాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ కె.విజయ కుమారి ని కోరుతూ వినతి పత్రం సమర్పించినట్లు శేకుబోయిన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బి.సి పట్టణ అధ్యక్షులు తోట బాబు, బెల్లంకొండ రవి ప్రసాద్, జోగి శివ, చేబోయిన కోటేశ్వరరావు, జన్ను గోవిందు, విశ్వనాథపల్లి సుబ్రమణ్యం, ఆళ్ల స్వరూప్, బోయిన సాయి, పుట్టి రాజశేఖర్, తదితర బీ.సీ నాయకులు పాల్గొన్నారు.

# డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య మెమోరియల్ బిల్డింగ్, మ్యూజియం, లైబ్రరీ ఏర్పాటు చేయాలి



**(వి న్యూస్ మచిలీపట్నం):** డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య మెమోరియల్ బిల్డింగ్, మ్యూజియం, లైబ్రరీ ఏర్పాటు త్వరితగతిన పనులు చేయించాలని డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య అభిమాన సంఘం సభ్యులు అయిన హిందూ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ ఆర్ కే మూర్తి, వేమూరి రామకృష్ణారావు, మోపర్తి సుబ్రమణ్యం, ఎల్ వి ఎస్ ప్రసాద్ లు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో స్పందన లో సోమవారం అర్జీ సమర్పించి అనంతరం వారు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య మెమోరియల్ బిల్డింగ్ మచిలీపట్నం నగర కార్పోరేషన్ పరిధిలో గల జిల్లా కోర్టు సెంటర్ నందలి రెవెన్యూ కల్యాణ మండపం పక్కన గల స్థలంలో ఆర్ఎస్ నెంబర్ 371–1%ూ%2 నందు రెండు ఎకరాల స్థలమును ప్రభుత్వం వారు చీఫ్ జనరల్ మేనేజర్ అండ్ కన్వీనర్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ వారికి 30/04/2022 వ తేదీన డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య మ్యూజియం, హాల్, లైబ్రరీ తదితర నిర్మాణాలు చేసి ప్రజలకు ఉపయోగపడేలా డాక్టర్ భోగ రాజు పట్టాభి సీతారామయ్య పేరు చిరస్థాయిగా ఉండేలా ప్రభుత్వం వారు స్థలం శాంక్షన్ చేస్తే, పది నెలలు దాటుతున్న బిల్డింగ్ నిర్మాణానికి పనులలో జాప్యం జరగటం లో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు అన్నారు. ఆంధ్ర బ్యాంకు స్థాపించిన మహనీయుడు, మన బందరువాసి డాక్టర్ భోగ రాజు పట్టాభి సీతారామయ్య అలాంటి మహనీయుడు స్థాపించిన బ్యాంకు ను కేంద్ర ప్రభుత్వం యూనియన్ బ్యాంకు లో విలీనం చేయడం ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు అన్నారు.

అలాంటి మహనీయుడు పేరు మచిలీపట్నంలో చిరస్థాయిగా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం వారు పట్టాభి సీతారామయ్య పేరున మెమోరియల్ ఏర్పాటు చేయడానికి స్థలం ఏర్పాటు చేస్తే, పనులలో జాప్యం జరగడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని అన్నారు. ఇప్పటికైనా మన బందరువాసిగా చరిత్ర గల మహనీయుడు పేరు చిరస్థాయిగా నిలిచేలా ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్థలంలో త్వరితగతిన డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య మెమోరియల్ ఏర్పాటు చేయడానికి అధికారులు, యూనియన్ బ్యాంకు వారు, మన శాసనసభ్యులు పేర్ని నాని , మన పార్లమెంటు సభ్యుడు బాలసౌరి తక్షణమే చర్యలు తీసుకుని ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్థలంలో డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య మెమోరియల్ వెంటనే ఏర్పాటు చేయించాలని డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య అభిమానులుగా డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కి స్పందన లో అర్జీ సమర్పించడం జరిగింది అన్నారు.

# బచ్చుల కుటుంబ సభ్యులను పరామర్శించిన "ఆళ్ళ"



**(వి న్యూస్ విజయవాడ):** విజయవాడ రమేష్ హాస్పటల్లో చికిత్స పొందుతున్న తెలుగుదేశం పార్టీ జాతీయ క్రమశిక్షణ సంఘం చైర్మన్, శాసనమండలి సభ్యులు బచ్చుల అర్జునుడు ని సోమవారం ఉదయం సాగునీటి వినియోగ దారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు, మచిలీపట్నం తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు దండు సుబ్రహ్మణ్యం రాజు, ఎంపీటీసీ సభ్యులు పుసులూరు లక్ష్మీనారాయణ, తెలుగుదేశం పార్టీ నాయకులు కసుకుర్తి అర్జునరావు తో కలిసి పరామర్శించి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పడం జరిగింది. ఈ సందర్భంగా అర్జునుడి పెద్ద కుమారుడు బచ్చుల బోస్ మాట్లాడుతూ అర్జునుడుగారి ఆరోగ్య నిలకడగా ఉందని ఆయన ఆరోగ్యం పై ఎప్పటికప్పుడు వైద్యులతో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు మాట్లాడుతూ అర్జునుడు సాధ్యమైనంత త్వరగా కోలుకుని పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటారని ఆకాంక్షించారు.

# నవ సమాజ నిర్మాణానికై" వి న్యూస్" దినపత్రిక చేస్తున్న కృషి అభినందనీయం

## -సర్పంచ్ చెరుకువాడ బలరామరాజు



**(వి న్యూస్ కైకలూరు) :** స్థానిక మండల పరిధిలోని దొడ్డిపట్ల గ్రామ సచివాలయం నందు, సోమవారం" వి న్యూస్ 20 23 క్యాలెండర్" ఆవిష్కరణ స్థానిక సర్పంచ్ చెరుకువాడ బలరామరాజు చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సామాజిక సమతుల్యతకై 'వి న్యూస్' దినపత్రిక చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన వి న్యూస్ దినపత్రిక ప్రాముఖ్యతను తెలియజేస్తూ, సరళమైన భాషలో, తనదైన శైలిలో ప్రత్యేక కథనాలను అందిస్తూ నవ సమాజ నిర్మాణానికై'"వి న్యూస్' ముందు వరుసలో ఉండటం తమకు ఎంతో ఆనందంగా ఉందని తెలియజేయడం జరిగింది. రానున్న రోజుల్లో మరిన్ని ప్రజా శ్రేయస్సు కథనాలతో, వి న్యూస్ దినపత్రిక ముందుకెళ్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు, ఆయన తెలియజేశారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ నాగనబోయిన సురేష్, పలువురు వైసిపి నాయకులు, పంచాయతీ కార్యదర్శి కేశిరెడ్డి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామ పెద్దలు మరియు స్థానిక" వి న్యూస్" దినపత్రిక ప్రతినిధి ఎన్.వి.ఆర్ పేర్రాజు (కైకలూరు మీడియా ప్రొఫెష నల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు) తదితరులు పాల్గొన్నారు.

Owned by EDITOR and Publisher: PREM NATH THOKALA, 26/152, Buttaipet, Machilipatnam, Krishna Dist.,Printed at Sri Lakshmi Ofset Printer binders, D.no : 32-26-126/13, opp BSNL Bhavan, Chuttagunta, Vijayawada-4. ph:08672 227347.,cell 9848667347 - RNI NO: APTEL/2015/65279